# మానవత్వం పరిమళించిన రోజు

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపు తెరిచింది పావని.

ఎదురుగా సౌరభ్ నిలబడివున్నాడు. అతని చేతిలో గిఫ్ట్ ప్యాకెట్ ఉంది.

"రండి..." నవ్వుతూ ఆహ్వానించింది అతన్ని.

సౌరభ్ వచ్చి హాల్లోని సోఫాలో కూర్చున్నాడు. పావని తలుపు మూసి, గడియ వేయడం చూసి ఆశ్చర్యపోయాడు.

"దోమలు ఈ సమయంలో ఎక్కువగా ఇంట్లోకి వస్తూంటాయి. అందువల్ల తలుపు వేసి ఉంచుతాను. మంచినీళ్లు తీసుకుంటారా?" అని అడిగింది.

"ఇవ్వండి..."

ఆమె లోపలికి వెళ్లింది. అతను హాలును పరిశీలించసాగాడు. ఏ వస్తువు ఎక్కడ ఉండాలో అక్కడే అమర్చినట్లు హాలు అందంగా కనబడుతోంది. హాలు మధ్యలో టేబుల్‌పై కేక్ పెట్టి ఓ సన్నటి రేపర్ మూసి ఉంచారు.

పావని అందించిన మంచినీళ్లు త్రాగుతూ "పాపెక్కడ?" అని అడిగాడు.

ఆమె సిగ్గుపడుతూ... "మాకింకా పిల్లలు లేరండీ.." అంది.

"మరి, పుట్టినరోజు ఎవరిది? మీదా?"

అవునన్నట్టు తలూపింది.

అతనికి ఆశ్చర్యమేసింది. ఆమెకు దాదాపు ముప్పై ఏళ్లుంటాయి. ఈ వయసువాళ్ళు పదిమందినీ పిలిచి పుట్టినరోజు జరుపుకోవడం అతనెన్నడూ చూడలేదు. సినిమా స్టార్లు, రాజకీయ నాయకులు ఇలా జరుపుకోవడాన్ని పేపర్లో చదివాడు. అంతే..!

"మీవారు బయటికి వెళ్లారా?"

"ఆయన దుబాయ్‌లో ఉంటారు."

అతనికి మరింత ఆశ్చర్యమేసింది. భర్త ఊర్లో లేకుండా ఆమె తన పుట్టినరోజు జరుపుకోవడం విడ్డూరంగా అనిపించింది అతనికి.

"ఇంకా ఎవరూ రానట్లుంది..." అన్నాడు వాచీ చూసుకుంటూ.

"ఇంకెవరినీ పిలవలేదు. మిమ్మల్నొక్కరినే పిలిచాను..."

ఈసారి ఆశ్చర్యంతో పాటు భయం కూడా కలిగింది అతనికి. విజయవాడ నుండి బదిలీపై ఈమధ్యే హైదరాబాదు వచ్చాడతను. అతను రిపోర్ట్ చేసిన బ్రాంచి 'మహిళాబ్రాంచి'గా పేరుపొందింది. కారణం... ఆ బ్రాంచిలో పనిచేసే వాళ్ళందరూ స్త్రీలే! త్వరలో రిటైరవబోతున్న ఓ వ్యక్తి మేనేజరుగా పనిచేస్తున్నాడు. సౌరభ్ రాకముందు ఆ బ్రాంచిలో అతనొక్కడే మగవాడు.

సౌరభ్‌కు కాస్త ఇబ్బందిగా అనిపించసాగింది ఆ బ్రాంచిలో పనిచేయడం! ఆఫీసులో పనిచేసే స్త్రీలలో చాలామంది అందగత్తెలే! కొంతమంది పెళ్ళికాని అమ్మాయిలు కూడా ఉన్నారు. అందరూ చురుకుగా పనిచేస్తూ ఉంటారు, నవ్వుతూ పలకరించుకుంటారు, ఒకరితో ఒకరు స్నేహంగా ఉంటారు. అయితే ఎవరు ఎటువంటివారో అతనికింకా అవగతం కాలేదు.

బ్రాంచిలోని అందర్లోకి పావని మరింత అందగత్తె! అతని సీటుకు ఆమె సీటు దగ్గరగా ఉండటంతో ఆమెతోనే కాస్త పరిచయం ఎక్కువ అతనికి.

సాయంత్రం బర్త్‌డే పార్టీ ఉందని, తప్పకుండా రమ్మని ఇంటి అడ్రస్ ఇచ్చింది పావని. అయితే ఆమె తనొక్కడినే ఆహ్వానించిందని తెలుసుంటే వచ్చేవాడు కాదు.

పావని సౌరభ్ కూర్చున్న సోఫాలోనే కాస్త దూరంగా కూర్చుంది.

"దుబాయ్‌లో మీవారు ఏం చేస్తూంటారు?" ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టు అడిగాడు.

"బిజినెస్! ఆయన కెప్పుడూ డబ్బు ధ్యాసే! వయసులో ఉన్న భార్య ఒంటరిగా ఉందన్న ఆలోచనే లేదు. ఆరునెల్లకో, ఏడాదికో ఒకసారి వచ్చిపోతూంటారు. నేను రిజైన్ చేసి అక్కడికే వచ్చేస్తానంటే ఒప్పుకోరు. నా జీతం పోగొట్టుకోవడం యిష్టం లేదాయనకు. జీవితంలో అనుభవించాల్సిన వయసులో డబ్బుకోసం ఆరాటపడితే- ఆ తర్వాత వయసు ఉండదు కదండీ!"

అవునన్నట్టు తలూపాడు సౌరభ్.

"మీరు డ్రింక్స్ తీసుకుంటారా?" ఉన్నట్టుండి అడిగింది అతన్ని.

"వద్దండీ... నేను కూల్‌డ్రింక్స్ త్రాగను. టీ యివ్వండి చాలు!"

ఆమె పకపకా నవ్వుతూ- "డ్రింక్స్ అంటే కూల్‌డ్రింక్స్ కావండీ... విస్కీ, బ్రాందీ లాంటివి!" అంది. అతను భయంగా ఆమె వైపు చూసి "నాకు అలవాటు లేదండీ!" అన్నాడు.

"సరే... మీకు మాత్రం టీ యిస్తాను. మీరు టీటోటలర్ కదా!" అంటూ లోపలికెళ్ళింది.

అతనికి టీ తెచ్చియిచ్చి, ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుని మాట్లాడసాగింది. అయితే ఆమె మధ్యమధ్యలో లోపలికి వెళ్లిరావడం, హాలంతా క్రమక్రమంగా ఆల్కహాల్ వాసన వ్యాపించడం గమనించాడు సౌరభ్.

ఆమె ముద్దముద్దగా మాట్లాడుతోంది యిప్పుడు. అతను ఆమె వైపు విసుగ్గా, కోపంగా చూశాడు. ఆమె అతని వైపు చూస్తూ "ఏమిటలా చూస్తున్నారు?" అని అడిగింది.

"మీరు ఆల్కహాల్ తీసుకుంటారా?"

అవునన్నట్లు తలూపింది.

ఆమె కళ్ళు తెరవలేకపోతోంది. అవి మత్తుగా మూసుకుపోతున్నాయి.

"ఎందుకండీ... అందమైన జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారు?" బాధగా అడిగాడు.

"జీవితం అందమైనదే సౌరభ్‌గారూ! కానీ, దాన్ని అనుభవించే అదృష్టం అందరికీ ఉండాలిగా! కోరికలు ఉరకలు వేసే వయసులో యిలా ఒంటరిగా ఉండటం ఎంత నరకమో మీకు తెలియదు. కోరికల్ని అదుపులో ఉంచుకోవడానికి 'డైవర్షన్' తప్పనిసరి! ఆ డైవర్షన్ నాకీ మందులో దొరుకుతుంది!"

"మీరు చాలా తప్పు చేస్తున్నారు. ఈరోజు డైవర్షన్ కోసం చేస్తున్న పని రేపు మీ బలహీనతగా మారొచ్చు. యు మే బికమ్ యాన్ ఆల్కహాల్ అడిక్ట్! మీరు మీవారిని మందలించండి. జీవితంలో డబ్బులు అవసరమే! కానీ, డబ్బే జీవితం కాదని చెప్పండి. ఆయన వినకపోతే విడిపోతానని బెదిరించండి. అప్పుడూ వినకపోతే ఏం చేయాలో ఆలోచిద్దాం. ఆఫీసులో ఇంతమందున్నాం. అందరం కలిసి ఆయనకు నచ్చచెబుదాం."

"ఆఫీసులో ఎవరి పనిలో వారుంటారు. నా గొడవలు వినే తీరిక గాని, పట్టించుకునే ఓపిక గాని ఎవరికుంటుంది?"

"అదేమిటి అలాగంటారు? కొలీగ్స్ అంటే కలిసి పనిచేయడమే కాదు, ఒకరి కష్ట సుఖాల్ని మరొకరు పంచుకోవాలి. అందరం ఒకే కుటుంబసభ్యుల్లా మెలగాలి. మన బ్రాంచిలో అందరూ మంచివాళ్ళు, సంస్కారవంతులు. మీ సమస్యను పరిష్కరించే బాధ్యత మా అందరిదీ... సరేనా! లేవండి- ఆనందంగా కేక్ కట్ చేయండి!" సోఫాలోంచి లేస్తూ అన్నాడు.

"ఈ పుట్టినరోజు నాడు నాకు మంచి స్నేహితుడు దొరికాడు. రండి... మీరే కేక్ కట్ చేయాలి!" అంటూ కత్తి అతని చేతికిచ్చింది.

"పుట్టినరోజు మీది!"

"అయినా సరే... మీరే కేక్ కట్ చెయ్యాలి!" మొండిగా అంది.

"సరే... మీ ఆనందాన్ని నేనెందుకు కాదనాలి?" అంటూ సౌరభ్ టేబుల్ దగ్గరికి వచ్చి, కేక్‌పై ఉన్న రేపర్‌ని తీసి, కేక్ వంక చూసి ఆశ్చర్యపోయాడు.

'మానవత్వం పరిమళించిన రోజు!' అని రాసి ఉంది ఆ కేక్ పైన.

వెంటనే పావని చప్పట్లు తట్టింది. ఓ గది నుంచి ఆడవాళ్ళు, మగవాళ్ళు రాసాగారు బిలబిలమంటూ. వాళ్ళని చూపిస్తూ చెప్పింది పావని-

"వీళ్ళంతా మీకంటే ముందే వచ్చారు. మీరు మా పరీక్షలో నెగ్గారు సౌరభ్‌గారూ!"

"నాకేం అర్థంకావడం లేదు..." అయోమయంగా చూస్తూ అన్నాడు సౌరభ్.

"నేను చెబుతాను..." వందన కల్పించుకుంటూ అంది.

"సౌరభ్‌గారూ! మన బ్రాంచిలో ఆడవాళ్ళు ఎక్కువ. మేము యింట్లో ఉన్నట్లే ఆఫీస్‌లో కూడా ఫ్రీగా మూవ్ అవుతుంటాం. అందుకే మా బ్రాంచీకి ఆడవాళ్ళనే పోస్ట్ చెయ్యమని మేనేజ్‌మెంట్‌కు విజ్ఞప్తి చేశాం.

అయితే... బయట పనులు చేయడానికి మగవాళ్ళైతే యిబ్బంది ఉండదనీ, వీలైనంతవరకూ మంచి రిమార్కులు ఉన్నవాళ్ళనే పోస్ట్ చేస్తామనీ చెప్పారు. అయితే వాళ్ళ

అంచనాలను తారుమారు చేస్తూ ప్రవర్తించారు... గతంలో యిద్దరు మగవాళ్ళు. మాకు మగవాళ్ళంటేనే అసహ్యం కలిగేలా ప్రవర్తించారు. వాళ్ళ వేధింపులు భరించలేక 'ఉష' అనే అమ్మాయి ఉద్యోగం వదులుకుని వెళ్లిపోయింది. మేము పదే పదే మేనేజ్‌మెంట్‌కి విజ్ఞప్తులు చేసుకుని వారి పీడ వదిలించుకున్నాము."

"ఉష క్రమశిక్షణ, నిజాయితీ కలిగిన సిన్సియర్ వర్కర్. అటువంటి వాళ్ళకు మరో ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. ఉషకు దొరికింది కూడా! కానీ, అటువంటి ఉద్యోగినిని కోల్పోవడం మన సంస్థకు ఎంత నష్టమో ఆలోచించండి!" అంది సుప్రజ.

"ప్రతి నెలా మొదటి తారీఖున మన కొలీగ్స్ అందరూ ఎవరో ఒకరి యింట్లో కుటుంబసమేతంగా కలిసి సరదాగా గడపడం మాకు అలవాటు. ఈ సందర్భంలోనే మన ఆఫీసుకు క్రొత్తగా వచ్చిన మీకు పరీక్ష పెట్టి మీరూ ఆ సుందోపసుందుల్లాంటి వారైతే మిమ్మల్ని సోషల్ బాయ్‌కాట్ చెయ్యాలనీ, ఎల్లుండి మన బ్రాంచికొస్తున్న జి.ఎమ్.గారికి మీ గురించి చెప్పి మిమ్మల్ని వేరే బ్రాంచికి పంపించెయ్యాలనీ అనుకున్నాము.

మీరు మంచివారైతే మిమ్మల్ని మాలో కలుపుకుని మా సోదరుడిలా చూసుకోవాలని అనుకున్నాం. పావని కాలేజీ రోజుల్లో నాటకాల్లో నటించింది. ఆ అనుభవంతో ఈరోజు చక్కగా నటించింది. మీరు మా పరీక్షలో పాసయ్యారు. అదీ... నూటికి నూటయాభై మార్కులతో!" అంది వందన సంతోషంగా.

"తప్పటడుగు వేసే పరిస్థితి నేను మీకు కల్పించినా మీరు సంస్కారంతో ప్రవర్తించి మా మనసులు గెలుచుకున్నారు!" అంది పావని.

"ముఖ్యంగా... మీరు పావని బాధలు విని స్పందించిన తీరు, 'మనమంతా ఒక కుటుంబసభ్యులం' అన్న మీ మాట మాకందరికీ ఎంతో నచ్చింది" అంది అందర్లోకి సీనియర్ అయిన రామలక్ష్మి.

"మీ ఆవిడ ఊరినుంచి రాగానే చెప్పండి. మా మరదలికి క్రొత్త ఊర్లో ఏ ఇబ్బంది లేకుండా మేం చూసుకుంటాం!" అంది శాంతి.

పావని వెళ్లి వీధి తలుపు తెరిచింది. పిల్లలందరూ పరిగెత్తుకుంటూ వచ్చారు. ఇంకో గదిలోంచి బయటకు వచ్చిన వ్యక్తి సౌరభ్‌కి చేయి అందిస్తూ–

"నేను పావని భర్తని. పేరు... శ్రీనివాసరావు. అందరూ 'శీను' అంటారు. కానీ, 'దుబాయ్ శీను'ని కాదండోయ్! ఇక్కడే ఓ ట్రావెలింగ్ ఏజెన్సీలో పనిచేస్తున్నాను. ఐయామ్ వెరీ గ్లాడ్ టు మీట్ యు!" అన్నాడు.

"నాకూ మీ అందరి మధ్యా ఉన్నందుకు ఎంతో సంతోషంగా ఉంది!" అన్నాడు సౌరభ్.

అందరూ ఆనందంగా చప్పట్లు కొట్టారు.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 9 ఆగస్ట్ 2007 సంచికలో ప్రచురితమైన కథ